
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 30.5
కనిష్ఠం 23.4

ANDHRAJYOTHY



నల్లగొండ

3

బుధవారం 31 జూలై 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	518.10 (145.8335)	3,32,447	30,881
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.10 (3.80)	526.15	589.52
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	103.67 (1.10)	208	నిల్

చికెన్ ధరలు | లైవ్ : రూ.126 | డ్రెస్ : రూ.184 | స్కిన్‌లెస్ : రూ.210

నీళ్లొచ్చె..




వరద రాకతో క్రమక్రమంగా నీటిమట్టం పెరుగుతుండటంతో కళకళలాడుతున్న నాగార్జునసాగర్ జలాశయం

•5లో..

నిధులొచ్చె..



రైతుకు రుణమాఫీ చెక్ అందజేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, రుణమాఫీ పొందిన ఓ రైతు కుంటుంబం ఆనందం



రాష్ట్రమంతటా మొక్కలు నాటి పచ్చటి వనంగా మార్చేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. జిల్లాలో విస్తారంగా ముసురుతో కూడిన వర్షాలు కురుస్తుండటంతో మొక్కలను విరివిగా నాటాలని అధికారులు నిర్ణయించారు. మొక్కలు నాటడమేగాక నాటిన ప్రతీ మొక్కను బతికించేలా ప్రణాళిక రూపొందించారు. అయితే ఆచరణలో మాత్రం కార్యాచరణ కానరావడం లేదు. జిల్లాలోని అన్ని రహదారులకు ఇరువైపులా, ప్రభుత్వ కార్యాలయాల్లో, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని ప్రభుత్వం ఆదేశించగా, అటవీశాఖ అధికారులు ఆ వైపుగా ప్రణాళిక రూపొందించినట్టు లేదని స్వచ్ఛంద సంస్థలు వాపోతున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటే కార్యక్రమం సాగడంలేదని విమర్శిస్తున్నాయి.

నల్లగొండ

జిల్లాల వారీగా మొక్కల లక్ష్యం, పూర్తి ఇలా..

జిల్లా	మొక్కల లక్ష్యం	పూర్తయిన లక్ష్యం
నల్లగొండ	66.06లక్షలు	56శాతం
సూర్యాపేట	53లక్షలు	20శాతం
యాదాద్రి	17.45లక్షలు	42శాతం

వన మహోత్సవం
50శాతం లోపే

- ఉమ్మడి జిల్లాలో నాటాల్సిన మొక్కల లక్ష్యం 1.36కోట్లు
- లక్ష్యం నెరవేరేదెలా?
- 11 ప్రభుత్వ శాఖలకు బాధ్యతలు ఇచ్చిన ప్రభుత్వం
- నత్తనడకన సాగుతున్న మొక్కలు నాటే కార్యక్రమం
- ఇటీవల వర్షాలు కురిసినా కానరాని ప్రగతి

ఉమ్మడి జిల్లాలో మొక్కలు నాటే లక్ష్యానికి ప్రభుత్వ శాఖలు ఆమడదూరంలో ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మొక్కలు ఉధృతంగా నాటాల్సి ఉండగా, అన్ని శాఖలు నిర్లిప్తంగా వ్యవహరించాయి. ఉమ్మడి జిల్లాలో మొక్కలు నాటే లక్ష్యం 1.36కోట్లు కాగా, ఇప్పటి వరకు 50శాతం లోపే లక్ష్యం పూర్తయింది. సూర్యాపేట జిల్లాలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఈ జిల్లాలో 20శాతానికి మించి మొక్కలు నాటే లక్ష్యం పూర్తికాలేదు.

ప్రభుత్వ లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు సరైన స్థలాన్ని ఎంపిక చేయడంతో పాటు అన్ని రహదారులు, ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటాల్సి ఉంది. ఈ ఏడాది కూడా ప్రతీ కుటుంబానికి ఆరు పండ్ల మొక్కలైన జామ, నిమ్మ, మునగ, ఉసిరి, సీతాఫలం, అల్లనేరేడు పంపిణీ చేయనున్నారు. దీం తోపాటు పూల మొక్కలు గులాబీ, గన్నేరు, చామంతి, మల్లెపూల మొక్కలు పంపిణీ చేయనున్నారు. ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ చెరువుల గట్లపై, ఖాళీ స్థలాల్లో ఈత, ఖర్జూర మొక్క లు నాటనున్నారు. వ్యవసాయ భూముల్లో, గట్లపై టేకు, సుబాబుల్, యూకలిప్టస్, ఈత, ఖర్జూర మొక్కలు నాటనున్నారు. ఖాళీ స్థలాలు, గ్రామీణ రోడ్లు, రహదారులకు ఇరువైపులా వేప, కానుగ మొక్కలు నాటాల్సి ఉంటుంది. మొక్కలను కాపాడేందుకు వాచర్‌ను ఏర్పాటు చేయాలని, మొక్కలను సంరక్షించే విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశాలు ఇవ్వగా, ఉమ్మడి జిల్లాలో ఇవి అమలవుతున్న పరిస్థితి కనిపించడం లేదు.

మొక్కల లక్ష్యం 1.36కోట్లకు పైగానే

వనమాసం కార్యక్రమంలో భాగంగా నల్లగొండ జిల్లాలో వానాకాలంలో 66.06లక్షల మొక్కలు నాటాలన్నది లక్ష్యం. మొక్కల సంరక్షణ కోసం ఫీల్డ్ అసిస్టెంట్ మొదలు మేట్‌లకు శిక్షణ ఇచ్చారు. ఆ బాధ్యతను డీఆర్‌డీవోకు ప్రభుత్వం అప్పగించింది. రహదారులకు ఇరువైపులా స్థలం అధికంగా ఉంటే బహుళ వరుసల్లో మొక్కలు నాటాల్సి ఉంది. జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయిలో మొక్కలు నాటేందుకు కార్యచరణ రూపొందించడంతో పాటు అందుకు అధికారులను కూడా సమాయత్తం చేయాల్సి ఉంది. వన మహోత్సవానికి ఆయా నియోజకవర్గాల్లో స్థానిక శాసనసభ్యులను ఆహ్వానించడంతో పాటు జిల్లా స్థాయి అధికారులకు నిర్దేశించి లక్ష్యాన్ని చేరేలా ప్రణాళిక రూపొందించారు. ఇప్పటికే నర్సరీల ద్వారా మొక్కలు పంపిణీ చేయాల్సి ఉండగా, అవి నర్సరీల్లోనే దర్శనమిస్తున్నాయి. వర్షాలు సమృద్ధిగా లేకున్నా, ఇటీవల నాలుగైదు రోజుల ముసురుతో కూడిన వర్షం కురవడంతో మొక్కలు నాటేందుకు అనువైన వాతావరణం ఏర్పడింది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా వన మహోత్సవాన్ని పకడ్బందీగా చేపట్టి లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేయాల్సిన అధికారులు స్పందించలేదు. నల్లగొండ జిల్లాలో 11 శాఖలకు మొక్కలు నాటే బాధ్యత అప్పగించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖకు 19.05లక్షలు, అటవీశాఖకు 4 లక్షలు,వ్యవసాయశాఖకు 6లక్షలు, జిల్లా ఉద్యానశాఖకు 5లక్షలు, పంచాయతీరాజ్‌శాఖకు 19.50 లక్షలు, నీటిపారుదల శాఖకు 3.20 లక్షలు, ఐసీడీఎస్‌కు 8వేల మొక్కలు నాటే బాధ్యత అప్పగించారు. పశుసంవర్థక శాఖకు 30 వేలు, ఎక్సైజ్‌శాఖకు 3 లక్షలు, విద్యాశాఖకు 50వేలు, మునిసిపాలిటీకి 5.63లక్షల మొక్కలు నాటే బాధ్యత అప్పగించగా, ఏ ఒక్క శాఖ కూడా పూర్తిస్థాయిలో నాటిన దాఖలాలు లేవు.

- సూర్యాపేట జిల్లాలో వానాకాలంలో 53లక్షలకు పైగా మొక్కలు నాటాలన్నది లక్ష్యం. అందుకు అటవీశాఖ ఆధ్వర్యంలో 60 నర్సరీలు, గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో 405 నర్సరీల్లో మొక్కలు సిద్ధమయ్యాయి. అటవీశాఖ 6లక్షలు, గ్రామీణాభివృద్ధిశాఖ 25లక్షలు, పంచాయతీరాజ్ లక్ష, ఇరిగేషన్ 4.32లక్షలు, వ్యవసాయశాఖ 3లక్షలు, మునిసిపాలిటీల ఆధ్వర్యంలో 10లక్షల మొక్కలు నాటాల్సి ఉంది.
- యాదాద్రి జిల్లాలో ఈ ఏడాది 17.45 లక్షల మొక్కలు నాటాలన్నది లక్ష్యం. అందుకు జిల్లాలో మొత్తం 451 నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేశారు. వీటిలో గ్రామీణాభివృద్ధిశాఖకు చెందిన 418 నర్సరీల్లో మొక్కలు పెంచారు. గ్రామీణాభివృద్ధి శాఖ 9లక్షల మొక్కలు, అటవీశాఖ లక్ష, వ్యవసాయశాఖ 25వేలు, ఉద్యానవనశాఖ 50వేలు, పంచాయతీశాఖ 2లక్షలు, సాగునీటిశాఖ 25వేలు, రోడ్లు, భవనాల శాఖ 25వేలు, పంచాయతీరాజ్‌శాఖ 45వేలు, ఆబ్కారీశాఖ 40వేలు, పరిశ్రమలశాఖ 25వేలు, భువనగిరి, ఆలేరు, యాదగిరిగుట్ట, చౌటుప్పల్, మోత్కురు, పోచంపల్లి మునిసిపాలిటీల్లో 3.17లక్షల మొక్కలు నాటాలన్నది లక్ష్యం.

56శాతం మేర మొక్కలు నాటే కార్యక్రమం పూర్తి

జిల్లాలో నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా ఇప్పటి వరకు 56 శాతం మేర మొక్కలు నాటాం. వివిధ శాఖలకు కేటాయించిన లక్ష్యాలను ఆయా శాఖలు ఇప్పటికే చేరుకుంటున్నాయి. జిల్లాలో 66లక్షలకు పైగా మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేశాం. లక్ష్యానికి అనుగుణంగా వర్షకాలంలో పూర్తిస్థాయిలో మొక్కలు నాటుతాం. మరికొద్ది రోజుల్లో పూర్తి స్థాయిలో నూరుశాతం మొక్కలు నాటే కార్యక్రమం పూర్తవుతుంది.

- రాజశేఖర్, జిల్లా అటవీశాఖ అధికారి

ప్రభుత్వశాఖల్లో కదలిక ఏదీ?

వన మహోత్సవం కింద ఆయా శాఖలకు నిర్దేశించిన లక్ష్యాన్ని ఈ నెలాఖరులోగా పూర్తి చేయాల్సి ఉంది. రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటడంతో పాటు వాటిని కాపాడే బాధ్యతను కూడా తీసుకోవాలి. అయితే జూలై నెల ముగియవచ్చినా, ఇప్పటి వరకు మొక్కలు నాటే కార్యక్రమం ఊపందుకోలేదు. గత ప్రభుత్వ హయాంలో హరితహారం కింద మొక్కలు నాటే కార్యక్రమాన్ని వర్షకాలంలో ఉద్యమంగా చేపట్టి ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలను భాగస్వాములు చేసింది. నాడు మొక్కలు నాటినా సంరక్షణలో మాత్రం నిర్లక్ష్యం కారణంగా చాలా మొక్కలు



చనిపోయాయి. ప్రస్తుతం చాలా ప్రభుత్వశాఖలు వన మహోత్సవంలో పాల్గొనకపోవడం గమనార్హం. అంతేగాక వన మహోత్సవంపై పర్యవేక్షణ కొరవడింది. శాఖల మధ్య సమన్వయం లేకపోవడమూ కారణంగా నిలుస్తోంది. గతంలో మునిసిపాలిటీ సిబ్బంది ఇంటింటికీ మొక్కల పంపిణీతో పాటు విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో సంబంధితశాఖతో పాటు బాధ్యతలు తీసుకున్న శాఖలు ప్రజలకు మొక్కలు పంపిణీ చేసేవి. కానీ, ప్రస్తుతం ఆ వైపుగా చర్యలు కానరావడం లేదు.

43,130 మంది రైతులకు
రుణమాఫీ

కలెక్టర్ సి.నారాయణరెడ్డి



రెండోవిడత రుణమాఫీ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి

నల్లగొండ టౌన్, జూలై 30: రైతు రుణమాఫీలో భాగంగా జిల్లాలో రెండో విడత రూ.1.50లక్షల లోపు రుణాలు ఉన్న 43,130 రైతు కుటుంబాలకు సంబంధించిన 50,409 బ్యాంకు ఖాతాల్లో రూ.503.89 కోట్లు జమవుతాయని కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్ నుంచి రెండో విడత రుణమాఫీ ప్రక్రియను ప్రారంభించగా, కలెక్టరేట్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, తొలి విడత జిల్లాలో రూ.1లక్షలోపు రుణమాఫీ నగదు 78,757 రైతులకు చెందిన 83,121 బ్యాంకు ఖాతాల్లో రూ.481.63కోట్లు జమయ్యాయన్నారు. రెండో విడత రూ.1.50లక్షల లోపు రుణమాఫీకి రూ.503.89కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మొదటి విడతలో సాంకేతిక కారణాలతో 456 బ్యాంకు ఖాతాల్లో రుణమాఫీ నగదు జమ కాలేదన్నారు. రెండో విడత నగదు విషయంలో సమస్యలపై బుధవారం నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. సోమవారం 'ప్రజావాణి'లో సైతం ఫిర్యాదులు తీసుకోవాలన్నారు. ఫిర్యాదుల విభాగాలు ఉద యం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించాలని, జిల్లా వ్యవసాయాధికా రి కార్యాలయంలో ఉదయం 10.00 గంటల నుంచి సాయంత్రం వరకు పనిచేయాలన్నారు. బ్యాంకుల్లో సైతం నోడల్ అధికారిని ప్రత్యేకంగా నియమించాలన్నారు. రుణాల రెన్యూవల్‌కు సైతం బ్యాంకర్లు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మొదటి విడత 84వేల బ్యాంకు ఖాతాలకు ఇప్పటివరకు 23వేల బ్యాంకు ఖాతాల రుణాలు రెన్యూవల్ అయ్యాయన్నారు. రూ.158కోట్ల రూపాయలు రెన్యూవల్ అయ్యాయని, మిగతా అకౌంట్లకు సైతం ఆగస్టు 9 వరకు రెన్యూవల్ చేయాలని ఆదేశించారు. రుణమాఫీ మొత్తాన్ని ఇతర రుణాలకు మినహాయించవద్దన్నారు. రైతులకు ఇబ్బంది కలగకుండా బ్యాంకర్లు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ బోళ్ల వెంకటరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రామిక్, జిల్లా సహకార అధికారి కిరణ్‌కుమార్, నల్లగొండ మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాల పంపిణీ అభినందనీయం : కలెక్టర్

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించే పేద విద్యార్థులకు భారత సేవాశ్రమ సంఘం ఉచితంగా నోట్ పుస్తకాలు పంపిణీ చేయడం సంతోషకరమని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. భారత సేవాశ్రమ సంఘం ఆధ్వర్యంలో నల్లగొండ మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా నోట్‌పుస్తకాలు పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం కతాల్‌గూడ ప్రాథమిక పాఠశాలలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారత సేవాశ్రమ సంఘం దేశవ్యాప్తంగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులను గుర్తించి ఉచితంగా నోట్‌పుస్తకాలు అందజేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి భిక్షపతి, భారత సేవాశ్రమ సంఘం కార్యదర్శి మునీశ్వరానందస్వామి, ఎంఈవో కే.అరుంధతి, తదితరులు పాల్గొన్నారు.

రెండో విడతలో రైతుల పేర్లు గాయబ్!

నల్లగొండ: రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత రుణమాఫీ ప్రక్రియను మంగళవారం ప్రారంభించగా, సంబంధిత జాబితాను వివిధ శాఖల అధికారులకు సోమవారం రాత్రే చేరవేశారు. జిల్లాకు చెందిన పలువురి రైతుల ఖాతాలు, పేర్లు ఆ జాబితాలో మాయమయ్యాయి. సోమవారం వచ్చిన జాబితా ప్రకారం 83,649మంది రైతులకు రూ.1,014.68కోట్లు రెండో విడత రుణమాఫీ కానున్నట్టు అధికారులు పేర్కొన్నారు. సోమవారం అర్ధరాత్రి దాటాక మూడుసార్లు జాబితాను మార్చి మంగళవారం నాటికి రైతుల సంఖ్యను కుదించారు. రైతుల సంఖ్యను తగ్గించి 33,240మంది పేర్లు ఖరారు చేశారు. దీంతో రుణమాఫీ సొమ్ము రూ.503.89కోట్లకు పడిపోయింది. మొదటి విడతకు రుణమాఫీకి అర్హులైనా గ్రామానికి చెందిన 150మంది రైతులకు వర్తించలేదని కనగల్ మండలం పగిడిమర్రి, ఏమిరెడ్డిగూడెం గ్రామాలకు చెందిన రైతులు మంగళవారం కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. నల్లగొండ కెనరాబ్యాంక్‌లో రుణాలు తీసుకున్నామని, అధికారులను సంప్రదించగా కంప్యూటర్‌లో నో డేటా అని చూపుతోందని, తమకు వెంటనే రుణమాఫీ వర్తింపజేయాలని రైతులు కలెక్టర్‌ను కోరారు.

యువతలో మార్పు తెచ్చేందుకు 'మిషన్ పరివర్తన్'

- కలెక్టర్ నారాయణరెడ్డి
- డ్రగ్స్, గంజాయి రహిత జిల్లానే లక్ష్యం : ఎస్పీ శరత్‌చంద్ర పవార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి

నల్లగొండ క్రైం, జూలై 30: డ్రగ్స్, గంజాయికి దూరంగా ఉండేలా యువతలో మార్పు తెచ్చేందుకే 'మిషన్ పరివర్తన్' అని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. జిల్లా వ్యాప్తంగా గంజాయి తాగుతూ పట్టుపడిన 60మంది యువకులకు జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాను గంజాయి, మాదక ద్రవ్యాల రహితంగా మార్చేందుకు 'మిషన్ పరివర్తన్' పేరుతో యువతలో మార్పు తీసుకొచ్చేందుకు పోలీస్‌శాఖ ప్రయత్నించడం గొప్ప విషయమన్నారు. మనిషి జీవితంలో 15-30 ఏళ్ల వయసు చాలా ముఖ్యమైనదని, జీవితాన్ని మలుచుకునే దశలో మాదక ద్రవ్యాలకు బానిసవడం ద్వారా జీవితాలు నాశనం అవుతున్నాయన్నారు. తల్లిదండ్రులు సైతం పిల్ల ల నడవడిక, వ్యవహార శైలిపై శ్రద్ధ చూపాలన్నారు. పిల్లలు వ్యసనాలకు బానిసలు కాకుండా తొలుత తల్లిదండ్రుల్లో అవగాహన రావాలన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో గంజాయి టెస్టింగ్ కిట్లను అందుబాటులో ఉంచామన్నారు. ప్రతి రోజూ డ్రంకెన్ డ్రైవ్‌లా గంజాయిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. ఒకసారి గంజాయి, ఇతర మత్తు పదార్థాలు తీసుకుంటే ఆరు నెలల వరకు దాని ప్రభావం శరీరంలో ఉంటుందన్నారు. గంజాయి తీసుకునేవారికి ఒకటి రెండుసార్లు కౌన్సెలింగ్ ఇచ్చి మళ్లీ పరీక్ష చేస్తామని, మళ్లీ మాదక ద్రవ్యాలు సేవించి పట్టుపడితే ఆరు నెలల వరకు జైలు శిక్ష ఉంటుందన్నారు. మాదక ద్రవ్యాలు విక్రయించినా, తీసుకున్నా డయల్ 100, మొబైల్ నంబర్ 8712670266కు గానీ, సంబంధిత పోలీస్ స్టేషన్‌కు గానీ సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చినవారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. అనంతరం ప్రముఖ సైక్రియాటిస్ట్ డాక్టర్ శివకుమార్ పలు వీడియోల ద్వారా యువకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాములునాయక్, డీఎస్పీలు రమేష్, కొలను శివరాంరెడ్డి, సీఐలు డానియల్‌కుమార్, రవికుమార్, ఆర్ఐ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

నృసింహుడికి వైభవంగా నిత్యపూజలు

•5లో..

యాదగిరీశుడిని దర్శించుకున్న ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ రంగారావు

బీసీలకు ఇచ్చిన హామీలను అమలుచేయాలి

బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు కడగంచి రమేష్



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్, జూలై 30: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు కడగంచి రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే మోసానికి మారుపేరని, అధికారంలోకి వచ్చేందుకు అమలు కానీ హామీలు ఇచ్చి బీసీలను మోసం చేసిందన్నారు. ఎన్నికల ముందు కామారెడ్డి బహిరంగ సభలో బీసీ డిక్లరేషన్ చేస్తామని హామీ ఇచ్చి, ప్రభుత్వం ఏర్పడ్డాక అమలు చేయడంలేదన్నారు. బడ్జెట్‌లో బీసీలకు తగిన ప్రాధాన్యం ఇవ్వకుండా మోసం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వదని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఒక మాట ఎన్నికల తరువాత ఒక మాట మాట్లాడుతూ ప్రజలను మోసం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ఆరు గ్యారెంటీలు, అమలుకాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారం చేపట్టి ఏడు నెలలైనా బీసీ డిక్లరేషన్‌పై ఊసెత్తకుండా ఎత్తకుండా పబ్బం గడుపుతోందన్నారు. సీఎం వెంటనే బీసీలకు క్షమాపణ చెపాలని డిమండ్ చేశారు. లేదంటే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పిట్టల శ్రీను, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు చెన్నమోని రాములు, పోతపాక లింగస్వామి, ఓబీసీ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఏరుకొండ హరి, తిరందాసు కనకయ్య, పెద్దగోని అంజన్‌కుమార్, చింత ముత్యాలరావు, కొండ భవాని ప్రసాద్, కోమటి వీరేశం, కంకణాల నాగిరెడ్డి, గడ్డం మహేష్, వనం మదన్మోహన్, పాలకురి రవిగౌడ్, మిర్యాల వెంకటేశం, కొండేటి శేఖర్, చండీశ్వర్, దినేష్ గౌడ్, ఆవుల కోటి, పెరిక ముని కుమార్, రావిళ్ల కాశమ్మ, నరేందర్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో అక్కడక్కడ చిరుజల్లులు

నల్లగొండ, జూలై 30: ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం చిరుజల్లులు కురిశాయి. సూర్యాపేట జిల్లాలో ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లబడింది. యాదాద్రి భువనగిరి జిల్లాలో ముసురు కురియగా, సగటున 2.9మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా తుర్కపల్లిలో 7.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా రాజపేటలో 0.7మిల్లీమీటర్ల వర్షం కురిసింది. నల్లగొండ జిల్లాలోని పలు మండలాల్లో ఆకాశం మేఘావృతమైంది.

పెద్దఅడిశర్లపల్లి: మండలంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దాదాపు అరగంటపాటు కురిసిన వర్షానికి ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి.

దేవరకొండ, కొండమల్లేపల్లి: దేవరకొండ, కొండమల్లేపల్లిలో మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వర్షానికి వీధులు జలమయమయ్యాయి. ఇదిలా ఉంటే వారం రోజులుగా దేవరకొండ నియోకవర్గంలో వర్షాల్లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. లక్ష ఎకరాలకు పైగా నియోజకవర్గంలో రైతులు పత్తి విత్తనాలు విత్తారు. దేవకొండ, చందంపేట, నేరెడుగొమ్ము మండలాల్లో వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో పత్తిచేలు వాడిపోయే పరిస్థితి ఏర్పడింది. మంగళవారం రాత్రి దేవరకొండ, కొండమల్లేపల్లితోపాటు పలు గ్రామాల్లో వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తమసేవకు జాతీయ అవార్డు

దేవరకొండ, జూలై 30: ఉత్తమసేవకు గుర్తింపు లభించింది. అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర పర్యావరణ, పరిరక్షణ, అటవీశాఖ ఆధ్వర్యంలో ఉత్తమ అవార్డును అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని దేవరకొండ రేంజ్ బేస్‌క్యాంపు ప్రొటెక్షన్ వాచర్ వెంకటయ్య సోమవారం ఢిల్లీలో అందుకున్నారు. కేంద్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి భూపేందర్ యాదవ్ నుంచి వెంకటయ్య ఉత్తమ అవార్డును అందుకున్నట్లు దేవరకొండ రేంజ్ ఎఫ్ఆర్‌వో సాయిప్రకాష్ మంగళవారం తెలిపారు. నల్లమలలో అటవీ భూములు, వన్యప్రాణుల సంరక్షణ, మొక్కల పెంపకం తదితర ఉత్తమ సేవలందించినందుకు వెంకటయ్యను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. నేరేడుగొమ్ము మండలం తిమ్మాపురం గ్రామపంచాయతీ పరిధిలోని పెద్దిరాజుబావి గ్రామానికి చెందిన వెంకటయ్య 20 సంవత్సరాలుగా అటవీశాఖలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన ఉద్యోగం చేస్తున్నారు. అటవీశాఖ కార్యాలయంలో కొద్ది రోజులు వాచ్‌మెన్‌గా పనిచేసిన వెంకటయ్యను దేవరకొండ అటవిశాఖ రేంజ్ బేస్ క్యాంపు ప్రొటెక్షన్ వాచర్‌గా నియమించారు.



కేంద్ర మంత్రి నుంచి జాతీయ అవార్డు అందుకుంటున్న వెంకటయ్య

ఐదుగురు సభ్యులతో కూడిన బేస్‌క్యాంపులో వాచర్‌గా విధులు నిర్వహిస్తూ అటవీ సంరక్షణకు కృషి చేస్తున్నారు. తమ సేవలను గుర్తించి ప్రభుత్వం రెగ్యులర్ చేసి ఆదుకోవాలని వెంకటయ్య కోరారు.

సాగర్‌కు కృష్ణమ్మ పరవళ్లు

● కొనసాగుతున్న ఇన్‌ఫ్లో.. ● 10 రోజుల్లో ప్రాజెక్ట్ నిండే అవకాశం ● త్వరలో ఎడమ కాల్వకు నీటి విడుదల?

శ్రీశైల మల్లన్న చెంత నుంచి కృష్ణమ్మ పరవళ్లు మొదలుపెట్టింది. బిరబిరా పారుకుంటూ నందికొండ మదినిండేలా సాగర్‌కు చేరుతోంది. కొండలు.. గుట్టలు దాటుకుంటూ పరుగున వస్తున్న కృష్ణమ్మను తన ఒడిలో చేర్చుకునేందుకు సాగర్‌మాత.. తెలుగు రాష్ట్రాల అన్నపూర్ణ సిద్ధమైంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు మంగళవారం ఒక్క రోజులోనే ఆరు అడుగుల మేర సాగర్‌నీటి మట్టం పెరిగింది. ఇలాగే వరద రాక కొనసాగితే మరో 10 రోజుల్లో నాగర్జునసాగర్ పూర్తిస్థాయి సామర్థ్యంతో నిండనుంది.

● నాగార్జునసాగర్

ఎగువనుంచి వస్తున్న వరదతో నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం ఒక్క రోజులో ఆరు అడుగులు పెరిగింది. శ్రీశైలం ప్రాజెక్టుకు మంగళవారం సాయంత్రం 4,13,178 క్యూసెక్కుల వరద వస్తుండటంతో, 10 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2,75,700 క్యూసెక్కులు, కుడి, ఎడమ జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 56,747 క్యూసెక్కులు మొత్తంగా 3,32,447 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదులుతున్నారు. దీంతో సోమవారం సాయంత్రం 512.20 అడుగులుగా (136.6461టీఎంసీలు) ఉండగా ఒక్క రోజులో ఆరు అడుగుల నీటి మట్టం పెరిగి మంగళవారం రాత్రికి 518.10 అడుగులకు (145.8335 టీఎంసీలకు) చేరింది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.5050 టీఎంసీలు), ప్రస్తుతం 518.10 అడుగులుగా(145.8335 టీఎంసీలు) నమోదైంది. సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం పూర్తిస్థాయికి చేరుకోవాలంటే మరో 167.2856 టీఎంసీలు నీరు సాగర్‌కు వచ్చి చేరాలి. సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం పూర్తిస్థాయికి చేరుకోవాలంటే ఎగువ నుంచి వరద రాక ఇలాగే కొనసాగితే మరో 10 రోజుల సమయం పట్టవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 6,041 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 900 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం నుంచి 23,940 మొత్తంగా 30,881 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతుండగా ఎగువ నుంచి 3,32,447 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.



శ్రీశైలం నుంచి కృష్ణమ్మ పరవళ్లు, 518.10 అడుగుల వద్ద నాగార్జునసాగర్ నీటి మట్టం

ఆగస్టు మొదటి వారంలో ఎడమ కాల్వకు నీటి విడుదల?

నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలో ఎడమ కాల్వ కింద ఉన్న ఆయకట్టుకు ఆగస్టు 2 లేదా 3వ తేదీన సాగు నీటిని విడుదల చేయనున్నట్లు సమాచారం. ఎడమ కాల్వ ఆయకట్టుకు సాగు నీరు అందించాలంటే సాగర్‌లో కనీసం 150 టీఎంసీల నీటి లభ్యత ఉండాలి. గత ఏడాది ఎగువనుంచి సాగర్‌కు వరద రాకపోవడంతో ఆయకట్టుకు క్రాప్ హాలిడే ప్రకటించారు. ఈ ఏడాది సాగర్‌కు జూలై నెల చివరలోనే ఎగువనుంచి వరద రాక మొదలవడంతో సాగర్ ప్రాజెక్టు నీటి మట్టం మరో రెండు రోజులల్లో 150 టీఎంసీలకు చేరుకుంటుంది. దీంతో ఈ ఏడాది వానాకాలం సాగుకు ప్రతి ఏడాది మాదిరిగానే ఆగస్టు 2 లేదా 3వ తేదీన సాగు నీటిని విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. నీటి విడుదలకు మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరుకానున్నట్లు తెలిసింది. గత పదేళ్లలో ఒకటి రెండు సంవత్సరాలు మినహా ప్రతి ఏటా ఆగస్టు మొదటి వారంలోనే ఎడమ కాల్వ ఆయకట్టుకు సాగు నీటిని విడుదల చేశారు.

గత ఏడాది బీడుగా మారిన ఆయకట్టు

ఎడమ కాల్వకు ఆయకట్టు కింద 6.50లక్షల ఎకరాల వరి సాగవుతోంది. గత ఏడాది క్రాప్ హాలిడే ప్రకటించడంతో బోర్లు, బావులకింద కేవలం లక్ష ఎకరాలు మాత్రమే సాగు చేశారు. మిగిలిన 5.50లక్షల ఎకరాలు బీళ్లుగానే ఉన్నాయి. ఈ ఏడాది జూలై నెలలోనే సాగర్‌కు వరద రాక మొదలవడంతో ఆయకట్టులో రైతాంగం నారుమడిని సిద్ధం చేసుకుంటున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.5050 టీఎంసీలు) కాగా మంగళవారం సాయంత్రానికి 517.20 అడుగులు(144.2194 టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వకు 5,944 క్యూసెక్కుల నీటిని, ఎస్ఎల్‌బీసీ ద్వారా 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 6,744 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 2,52,386 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కేతేపల్లి: నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల పరిధిలోని మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. హైదరాబాద్ జంట నగరాలతో పాటు మూసీ ఎగువ పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు మూసీలోకి వరద వస్తోంది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం కూడా క్రమంగా పెరుగుతోంది. 645 అడుగుల(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి 643.10అడుగులు (3.80టీఎంసీ)లుగా నమోదైంది. ఎగువనుంచి ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో సోమవారం సాయంత్రానికి 636.79 క్యూసెక్కులు ఉండగా, మంగళవారం సాయంత్రానికి కొంత తగ్గి 526.15 క్యూసెక్కులుగా నమోదైంది. మూసీ ఆయకట్టులో వానాకాలం పంటల సాగుకు ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు 589.50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

పులిచింతల సమాచారం

మేళ్లచెర్వు: పులిచింతల ప్రాజెక్టు పూర్తిస్థాయి 175 అడుగులు (45.77 టీఎంసీలు) కాగా 103.67 అడుగులు (1.10 టీఎంసీలు)గా నమోదైంది. ఇన్‌ఫ్లో 208 క్యూసెక్కులు ఉండగా, ఎలాంటి అవుట్‌ఫ్లో లేదు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్

● సుమారు రెండు కిలోల గంజాయి స్వాధీనం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ అర్బన్, జూలై 30: గంజాయి సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. కొంతకాలంగా పట్టణ, పరిసర ప్రాంతాల్లో రహస్యంగా సంచరిస్తూ గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముఠా సభ్యుల్లోని తొమ్మిది మందిని అదుపులోకి తీసుకోగా, మరో నలుగురు పరారీలో ఉన్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ రాజశేఖర్‌రాజు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన చల్లా శివనాగరాజు, మంజు లక్ష్మి, దుర్గారావు, మిర్యాలగూడ మండలం జంకుతండాకు చెందిన సిరిపాటి రవీందర్, దుద్దుడుకు అంజి అలియాస్ అంజనేయులు, అవంతీపురం గ్రామానికి చెందిన చెలిమండ్ల సుభాష్, మీసాల ప్రవీణ్ కుమార్, శివాజీ, మిర్యాలగూడ పట్టణం గణేష్‌నగర్‌కు చెందిన షేక్ సమీర్, తరుణ్, లైటింగ్ సమీర్, దామరచర్ల మండలం రాళ్లవాగుతండాకు చెందిన ధీరావత్ ఉపేందర్, బీహార్ రాష్ట్రం, మధువని జిల్లా లక్ష్మీపూర్ కల్యాయ్ గ్రామానికి చెందిన లాలూకుమార్ అనే 13 మందిని నిందితులుగా గుర్తించినట్లు తెలిపారు. వీరిలో ప్రవీణ్‌కుమార్, తరుణ్, దుర్గారావు, శివాజీలు పరారీలో ఉండగా, మిగతా తొమ్మిది మందిని ఈ నెల 29న రైల్వేస్టేషన్ రహదారి పక్కన ఉన్న చెట్లపొదల్లో పట్టుకున్నట్లు తెలిపారు. వీరి నుంచి సుమారు రూ.26వేల విలువ చేసే 1.950 కిలోల గంజాయి లభ్యమైందన్నారు. మాచర్ల మండలానికి చెందిన శివనాగరాజు, మంజు లక్ష్మి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖ జిల్లా పాడేరు, నర్సీపట్నం ప్రాంతాల నుంచి గంజాయిని కొనుగోలు చేసి ఇక్కడ సరఫరా చేస్తున్నట్లు నేరం అంగీకరించారు. అదేవిధంగా పోలీసుల దాడిలో పట్టుబడిన నిందితులంతా గంజాయి సరఫరా చేయడంతోపాటు వినియోగిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైందన్నారు. నిందితుల్లో బీహార్‌కు చెందిన లాలూకుమార్ దామరచర్ల మండలంలోని యాదాద్రి పవర్‌ప్లాంట్‌లో పనిచేస్తూ తోటి కార్మికులకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు నేరం అంగీకరించినట్లు వివరించారు. పరారీలో ఉన్న నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దింపామన్నారు. నింతుల నుంచి ఐదు సెల్‌ఫోన్లు, రూ.3500ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు. మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు ఆధ్వర్యంలో దాడిచేసి గంజాయి సరఫరా అంతర్రాష్ట్ర ముఠాను చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐ నరేష్, వాడపల్లి ఎస్ఐ రవి, వేములపల్లి ఎస్ఐ విజయ్‌కుమార్, ఏఎస్ఐలు యాదగిరి, రాములునాయక్, ఉమాపతిరావు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

అనుమానితుడికి దేహశుద్ధి

భువనగిరి రూరల్, జూలై 30: అనుమానస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తికి స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం బస్వాపురంలో ఈ ఘటన జరిగింది. మహబూబ్‌నగర్ జిల్లా మరికల్ మండలం దన్వాడ గ్రామానికి చెందిన సంపంగి రాము కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. అయితే మంగళవారం బస్వాపురంలో అనుమానస్పదంగా తిరుగుతుండడంతో గ్రామస్థులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. గాయపడిన రాముకు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చికిత్స అందించారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

యాదగిరీశుడిని దర్శించుకున్న ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ రంగారావు





ఆంజనేయస్వామికి హారతి ఇస్తున్న అర్చకుడు, రంగారావుకు స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఈవో

భువనగిరి అర్బన్, జూలై 30: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, స్వామికి నిత్య పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొండపైన విష్ణుపుష్కరిణి చెంత ఆంజనేయస్వామికి వేదమంత్రాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ప్రధానాలయంలోని స్వయంభువులను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 11,95,592 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. లక్ష్మీనృసింహుడిని ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ రంగారావు, కమిషన్ సభ్యులు, హెచ్.జెదొర వేర్వేరుగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అనంతరం వారికి వేద పండితులు వేదాశీర్వచనం చేయగా, ఈవో ఏ.భాస్కర్‌రావు లడ్డు ప్రసాదాన్ని అందజేశారు.

రూ.కోట్లు వెచ్చించినా వసతుల్లేవు

● శాసనసభలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



మాట్లాడుతున్న అయిలయ్య

భువనగిరి అర్బన్, జూలై 30: యాదగిరి గుట్ట ఆలయానికి రూ.కోట్లు వెచ్చించినా వసతులు లేవని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. శాసనసభలో దేవాదాయ పద్దులపై విప్ మాట్లాడారు. అందుబాటులో ఉన్న భూముల్లో 1,000 గదులతో సత్రాలు నిర్మించాలని దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖను కోరినట్లు తెలిపారు. యాదగిరిగుట్టలో వసతుల కోసం రూ.18కోట్లు ఖర్చు చేసినావసతులు మాత్రం లేవన్నారు. వైటీడీఏ ద్వారా ఎంతో మంది రైతులు భూములు కోల్పోయినా అభివృద్ధి జరగలేదన్నారు. గత ప్రభుత్వం ఆలయ పునర్నిర్మాణం కింద ఎస్సీల భూములు సేకరించి వారికి పరిహారం కూడా పూర్తిగా ఇవ్వలేదన్నారు. ఆలేరు నియోజకవర్గ కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా మార్చాలని కోరారు. దూపదీప పథకం కింద 6,271మందికి నెలకు రూ. 10వేలు ఇస్తుండగా వాటిని రూ.12వేలకు పెంచాలన్నారు. గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణానికి 9టీఎంసీల సామర్థ్యం నుంచి నాలుగు టీఎంసీల ప్రతిపాదనలు మారుస్తూ తట్టెడు మట్టిని కూడా తీయలేదన్నారు. తపాసుపల్లి రిజర్వాయర్ నుంచి నీటిని అందించడంతోపాటు గంధమల్ల రిజర్వాయర్‌కు కూడా నిర్మించాలని విప్ కోరారు.

80వేల పుస్తకాలు చదివిన కేసీఆర్ తన పుస్తకాన్నే చదవలే..

● అసెంబ్లీలో తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్



మాట్లాడుతున్న మందుల సామేల్

మోత్కూరు, జూలై 30: 80వేల పుస్తకాలు చదివిన మాజీ సీఎం కేసీఆర్ తన పుస్తకాన్నే చదువక ఆగమయ్యాడని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ బీఆర్ఎస్‌పై ధ్వజమెత్తారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో మంగళవారం ఆయన మాట్లాడారు. ఓడిపోయినా, గెలిచినా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు 2014లో వారు ఎమ్మెల్యే అయ్యేనాటికి ఎంత భూమి ఉండే, ఇప్పుడు వారికెంత భూమి ఉందో లెక్క తీస్తే వారు ఎంత దోచుకు తిన్నారో తెలుస్తుందన్నారు. ప్రజలను దోచుకుని, కోట్లకు అధిపతులయ్యారన్నారు. నిజాం పాలనలో ఒక్క ఖాసీం రజ్వీ ఉంటే కేసీఆర్ పాలనలో నియోజకవర్గానికొక ఖాసీంరజ్వీ తయారయ్యారని దుయ్యబట్టారు. కేసీఆర్ పాలనలో మాట్లాడితే కేసులు, జైలేనన్నారు. నిజమైన ఉద్యమకారులను పార్టీ నుంచి గెంటేశారని, అందుకు ఉదాహరణ తానేనన్నారు. చివరకు తానే ఆ పార్టీని గెంటేయగా కాంగ్రెస్ తనకు టికెట్ ఇస్తే గెలిచానన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎన్నికల ముందు టిక్కేరు, మూసీ వాగుల నుంచి ఇసుక తరలించారన్నారు.

ఆగమ శాస్త్ర ప్రకారమే

జీర్ణోద్ధరణ గావించాలి

● శైవాగమ ఆచార్యులు శతశివం, షణ్ముఖ శివాచార్యులు





శైవాగమ సదస్సులో పాల్గొన్న పండితులను సన్మానిస్తున్న నిర్వాహకులు

నార్కట్‌పల్లి, జూలై 30: ఆగమ శాస్త్ర ప్రకారమే ఆలయాల్లో జీర్ణోద్ధరణ చేయాలని తమిళనాడుకు చెందిన ప్రముఖ శైవాగమ ఆచార్యులు శతశివం, టీఎస్ షణ్ముఖ శివాచార్యులు అన్నారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు సోమేశ్వర శివజ్ఞాన పీఠంలో జరిగిన త్రిదినాత్మక జాతీయ శైవాగమ సదస్సు మంగళవారం ముగిసింది. చివరి రోజు సభకు హాజరై అర్చకులనుద్దేశించి వారు మాట్లాడారు. తెలంగాణ ఆదిశైవ బ్రాహ్మణ అర్చక సంఘం, రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, కార్యదర్శి హరికిషన్ శర్మ, నీలకంఠ శివాచార్యుల ఆధ్వర్యంలో వైభవంగా ముగిశాయి. ఈ సదస్సు రాష్ట్రంలో శైవాగమ సంప్రదాయ అర్చకులందరికీ దివ్య సందేశాన్ని ఇచ్చింది. సనాతన ధర్మాన్ని పాటిస్తూనే ఆలయాల నిర్వహణ, ఆచారాల్లో ఆగమాలపై శైవాగమ సదస్సు వర్ధమాన అర్చకులకు దిశానిర్దేశం చేసింది. ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు, దీక్ష వైశిష్ట్యాలు, అర్చనా విధులు, వార, పక్ష, మాస, అయనాది విధులపై మార్గ నిర్దేశం చేసింది. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడుకు చెందిన ప్రముఖ శివాచార్యులు హాజరై ఆగమ నియమాలు, ఆచరణలపై తమ అనుభవ పాఠాలను సదస్సులో వివరించారు. ప్రాంతాలను బట్టి ఆచరణలో ఉన్న ఆగమాల విషయాల్లో అనేక మీమాంసలు, సందేహాలను నివృత్తి చేశారు. అనువంశిక అర్చక విధానంపై సదస్సు కీలక తీర్మానం చేసి వారికి బాసటగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ జిల్లా సహాయ కమిషనర్ కే.మహేంద్రకుమార్, చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం ఈవో సిరికొండ నవీన్‌కుమార్, వేదపాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'నవోదయ'కు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దవూర, జూలై 30: జవహర్ నవోదయలో 6వ తరగతిలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చలకుర్తి జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ నాగభూషణం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ జిల్లాలో దరఖాస్తులు చేసుకుంటున్నారో తల్లిదండ్రులు, విద్యార్థులు ఆ జిల్లాకు చెందిన వారై ఉండాలని, తల్లిదండ్రుల నివాస ధ్రువీకరణపత్రాలు పరిశీలిస్తామన్నారు. 3,4,5 తరగతులు ప్రభుత్వ, రికగ్నైజ్డ్, ఎయిడెడ్ పాఠశాలల్లో చదివి ఉండాలని, మే, 1, 2013 నుంచి జూలై 31, 2015 మధ్య జన్మించి ఉండాలని, కనీసం 75సీట్లు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకే కేటాయించినట్లు తెలిపారు. ప్రతీ విద్యార్థి ఒకసారి మాత్రమే దరఖాస్తు చేయడానికి అర్హుడని, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగులకు రిజర్వేషన్ ఉంటుందన్నారు.





18 గొర్రె పొట్టేళ్ల చోరీ

చిట్యాలరూరల్, జూలై 30: వ్యవసాయ పొలం వద్ద ఉన్న 18 గొర్రె పొట్టేళ్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్లలో సోమవారం రాత్రి ఈ ఘటన జరిగింది. వివరాల ప్రకారం.. ఉరుమడ్లకు చెందిన జాల యాదయ్య, జాల లింగస్వామి, జాల శ్రీను, జాల నర్సింహలు తమ గొర్రెలను బావుల వద్ద కొట్టంలో వదిలి వెళ్లారు. తిరిగి ఉదయం వచ్చి చూసే సరికి మొత్తం 18 గొర్రె పొట్టేళ్ల కన్పించకుండా పోయాయి. గుర్తు తెలియని వ్యక్తులు అపహరించి ఉంటారని బాధితులు మంగళవారం చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ట్రాక్టర్ల బ్యాటరీలు..

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లిలో మూడు రోజుల క్రితం గుర్తు తెలియని దొంగలు మూడు ట్రాక్టర్ల బ్యాటరీలను చోరీచేశారు. అర్వపల్లి గ్రామానికి చెందిన కనుకు మహేష్ రెండు ట్రాక్టర్ల బ్యాటరీలు, మేకల సంతు ట్రాక్టర్ బ్యాటరీ వైర్లు కట్‌చేసి చోరీ చేశారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం మాదారం గ్రామంలో ఐదు ట్రాక్టర్ల బ్యాటరీలను చోరీ చేశారు. వారం రోజులుగా 15ట్రాక్టర్ల బ్యాటరీలను చోరీ చేసినట్లు ట్రాక్టర్ల యజమానులు తెలిపారు. మంగళవారం అర్వపల్లి పోలీస్ స్టేషన్‌లో కనుకు మహేష్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

హుజూర్‌నగర్‌లో..

హుజూర్‌నగర్: పట్టణంలోని ఎన్జీవో కాలనీలో నివాసం ఉంటున్న చింతలచెరువు వీరస్వామి ఇంట్లో మంగళవారం ఉదయం చోరీ జరిగింది. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్న వీరస్వామి ఉదయం షాపునకు వెళ్లగా అతని భార్య అరుణ ఇంటికి తాళం వేసి పక్కింటికి వెళ్లి వచ్చింది. కాగా ఈ సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం, అదేవిధంగా బీరువా తాళం పగలగొట్టి అందులో ఉన్న మూడు తులాల నల్లపూసల తాడు, రెండు గ్రాముల మాటీలు దొంగిలించారు. దీంతో ఇంటి యజమాని వీరస్వామి పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

మోటకొండూరు, జూలై 30: తాటి చెట్టు పైనుంచి జారి పడడంతో గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలకేంద్రానికి చెందిన బొల్లేపల్లి సత్తయ్య (55) మంగళవారం మధ్యాహ్నం తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా, అక్కడ ప్రథమ చికిత్స అనంతరం హైదరాబాద్ తరలించారు.

ముగ్గురికి రిమాండ్

భువనగిరి రూరల్, జూలై 30: ట్రాక్టర్ ట్రాలీతోపాటు బోరు మోటార్లు, పైపులు, కేబుల్ వైర్లు దొంగిలించిన ముగ్గురు నిందితులను అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచినట్లు భువనగిరి రూరల్ ఎస్ఐ వి సంతోష్‌కుమార్ తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం వీరవెల్లికి చెందిన రేగు మల్లేశ్, నోముల శ్రీశైలం, దయ్యాల నరేశ్‌లు కలిసి గత నెల 3న భువనగిరి శివారులోని రాయిగిరి సమీపంలో గల మోత్కూరు రోడ్డులో ఓ షాపులో సుమారు 100 మీటర్ల కాపర్ వైరును అపహరించారు. అదే నెల 6వ తేదీన నోముల శ్రీశైలం ట్రాక్టర్ ఇంజన్ సాయంతో మండలంలోని చందుపట్ల గ్రామంలోని రైతు నర్సింహకు చెందిన వ్యవసాయ పొలంలో ఉన్న ట్రాక్టర్ ట్రాలీని దొంగిలించి నోముల శ్రీశైలం వ్యవసాయ బావి వద్ద దాచి పెట్టారు. అదేవిధంగా ఈ నెల 22న మండలంలోని వీరవెల్లికి చెందిన జమ్ముల భిక్షపతి వ్యవసాయ బావిలో రెండు బోరు మోటార్లు, 20 అడుగుల 12 పైపులను దొంగిలించారు. అయితే ఆ దొంగిలించిన పరికరాలను మంగళవారం విక్రయించేందుకు వాహనంలో భువనగిరి వస్తుండగా రాయిగిరి శివారులో పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. పోలీసులు వారిని విచారించగా, ట్రాక్టర్ ట్రాలీ, బోరు మోటార్లు, పైపులను ఎత్తుకెళ్లినట్లు ఒప్పుకున్నారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి మంగళవారం కోర్టులో రిమాండ్ చేసినట్లు రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

అంత్యక్రియలకు వెళుతూ.. అనంతలోకాలకు

బీబీనగర్, జూలై 30: తమ సమీప బంధువు అంత్యక్రియలకు వెళుతూ వృద్ధుడు అనంతలోకాలకు వెళ్లాడు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం రహీంఖానగూడ గ్రామశివారులో మంగళవారం ఈ ఘటన జరిగింది. ఎస్ఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. భూదాన్‌పోచంపల్లికి చెందిన బడుగు నర్సింహ(60) బీబీనగర్‌లోని ఓ మద్యం దుకాణంలో పని చేస్తున్నాడు. కాగా పోచంపల్లిలో తన సమీప బంధువు చనిపోయాడని తెలిసి ద్విచక్ర వాహనంపై బీబీనగర్ నుంచి పోచంపల్లికి బయలుదేరాడు. కాగా మార్గంమధ్యలో రహీంఖానగూడెం గ్రామ శివారులో మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఓ ప్రైవేటు స్కూల్ బస్సును ఢీకొట్టాడు. ఈ ఘటనలో నర్సింహ అక్కడికక్కడే మృతి చెందాడు. నర్సింహ కుమారుడు నవీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాము కాటుతో కార్మికుడు..

చౌటుప్పల్ రూరల్, జూలై 30: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామ సమీపంలోని నైల్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుడు పాముకాటుకు గురై చికిత్స పొందుతూ మృతి చెందాడు. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జార్కండ్ రాష్ట్రానికి చెందిన సుజిత్ మహళి నైల్ పరిశ్రమలో పనిచేస్తూ స్థానిక లక్ష్మీనర్సింహస్వామి కంపెనీ వెంచర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 28న రాత్రి గదిలో నిద్రిస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే గమనించిన స్నేహితులు హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పరిశ్రమ కాంట్రాక్టర్ గుండెపురం వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తంగడపల్లిలో యువకుడి ఆత్మహత్య

చౌటుప్పల్ రూరల్, జూలై 30: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మునిసిపాలిటీ తంగడపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు మంగళవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తంగడపల్లి గ్రామానికి చెందిన బొల్లమోని వెంకటేష్ కుమారుడు సంజీవ (22) ముస్కు అనంతరెడ్డి స్టేడియం సమీపంలో వేపచెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతికి కారణాలు తెలియరాలేదు. తండ్రి వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

టీజేఏసీ రాష్ట్ర వైస్‌చైర్మన్‌గా రామదాసు



నల్లగొండ టౌన్, జూలై 30: ఉపాధ్యాయ సంఘ ఐక్య కార్యచరణ సమితి (టీజేఏసీ) రాష్ట్ర వైస్ చైర్మన్‌గా జిల్లాకు చెందిన ఎస్‌జీటీల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిరందాసు రామదాసు నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని టీఎన్ జీవోస్ కేంద్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. తన నియామకానికి సహకరించిన సంఘం నాయకులకు రామదాసు కృతజ్ఞతలు తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి

దేవరకొండ, జూలై 30: స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని పార్టీలు బీసీలకు సముచిత స్థానం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. 'బీసీ కులజనగణన, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పెంపు' అనే అంశంపై దేవరకొండలో మంగళవారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడారు. బీసీలను కులాల వారీగా లెక్కించి సంఖ్య చెప్పకుండా రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో ఎదగకుండా చేస్తున్నార న్నారు. బీసీల ఓట్లకోసం రాజకీయ పార్టీలు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి అమలు చేయడంలేదన్నారు. సమావేశంలో నాయకులు ఏకుల రాజారావు, లాలునాయక్, నక్క వెంకటేష్‌యాదవ్, వస్కుల కృష్ణయ్య, జ్యోతిబసు, ఆంజనేయులు, భాస్కరచారి, అంకం చంద్రమౌళి, సత్యమూర్తి పాల్గొన్నారు.

మాదిగల ధర్మ దీక్షను విజయవంతం చేయాలి

త్రిపురారం, జూలై 30: ఢిల్లీలో ఆగస్టు 6వ తేదీన నిర్వహించే మాదిగల ధర్మ దీక్షను విజయవంతం చేయాలని మాదిగ సంఘాల మహాకూటమి నాయకులు కోరారు. మండలకేంద్రంలో మంగళవారం కరపత్రాలు ఆవిష్కరించారు. ఎమ్మార్పీ ఎస్ జిల్లా అధ్యక్షుడు మారపాక నరేందర్, రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు నకిరేకంటి అంజయ్య మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం 30ఏళ్లుగా రాజీలేని ఉద్యమాలు చేస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు బొజ్జ సోమయ్య, మొండికత్తి అశోక్, సైదులు, నాగయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

హాలియా, జూలై 30: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డీవీఎస్ ఫణికుమార్ డిమాండ్ చేశారు. హాలియాలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం సంఘం సభ్యత్వాలు నమోదు చేయించారు. ఉపాధ్యాయులకు స్పెషల్ టీచర్లను రెగ్యులర్ చేయించడం, స్పెషల్ క్యాజువల్ లీవులు ఇప్పించడంలో సంఘం కీలక పాత్ర పోషించిందన్నారు. కార్యక్రమంలో అనుముల మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్ను వెంకటరెడ్డి, మంచికంటి మధులు, కేజీబీవీ ఎస్‌వో కె. హైమావతి, చింతల వెంకటేశ్వర్లు, మందా సైదులురావుగౌతమ్, సక్రునాయక్ పాల్గొన్నారు.

'జగదీ‌ష్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు'

దేవరకొండ, జూలై 30: మాజీమంత్రి జగదీ‌ష్‌రెడ్డిపై అసెంబ్లీలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల రాజు అన్నారు. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం దేవరకొండలో పట్టణంలో మంత్రి వెంకటరెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్, జగదీ‌ష్‌రెడ్డిలదే అన్నారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వీ నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డుపల్లి కృష్ణ, పొట్ట మధు, ఖాదర్‌బాబా, సత్తార్, సత్యనారాయణ, చంద్రమౌళి, బాబా, నరహరి తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలి

డిండి, జూలై 30: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారి డిమాండ్ చేశారు. మండలంలోని బ్రహ్మణపల్లిలో మంగళవారం జరిగిన పార్టీ గ్రామశాఖ మహాసభలో మాట్లాడారు. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా డిండి ప్రాజెక్టు నింపి వరిచేలను కాపాడాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి 9 డిసెంబరు 2023 వరకు తీసుకున్న రుణాలను మాఫీ చేయాలని కోరారు. పార్టీ గ్రామశాఖ కార్యదర్శిగా ఏటెల్లి వెంకటయ్యను ఎన్నుకున్నారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు ఎండీ ఖైనొద్దిన్, శైలేజ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మాడ్గులపల్లి: అర్హులైన రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ అన్నారు. మండలకేంద్రంలో మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన రూ.2లక్షల రుణమాఫీ పథకంలో భాగంగా మంగళవారం చేసిన రూ.1.5లక్షల రుణమాఫీ అర్హులైన అనేక మంది రైతులకు వర్తించలేదన్నారు. ప్రభుత్వం రుణమాఫీలో షరతులు విధించడం సరైందికాదన్నారు. రైతు భరోసా పథకం కింద నగదును సకాలంలో జమా చేయాలని డిమాండ్ చేశారు.

అవగాహనతో మోసాలను గుర్తించాలి

నార్కట్‌పల్లి, జూలై 30: నిత్యావసర వస్తువుల విక్రయాల్లో జరుగుతున్న మోసాలు, కల్తీని అవగాహనతో గుర్తించాలని తెలంగాణ కన్జ్యూమర్ ఫోరం (టీసీఫ్) రాష్ట్ర అధ్యక్షుడు అంబు రాథోడ్, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) టెక్నికల్ అసిస్టెంట్ శ్రీకాంత్, టీసీఎఫ్ రాష్ట్ర సెక్రటరీ కేతిరెడ్డి శకుంతలారెడ్డి అన్నారు. 'మార్కెట్‌లో నిత్యావసర వస్తువులతో పాటు ఇతర నిల్వ ఉండే వస్తువులతో మోసాలకు గురికాకుండా ఉండేదెలా' అనే అంశంపై టీసీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం నార్కట్‌పల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బీఐఎస్ యాప్‌పై కూడా అవగాహన కల్పించారు. విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు నిర్వహించి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ హెచ్ఎం ఆరోగ్యమ్మ, ఉపాధ్యాయులు శేఖర్‌రెడ్డి, రామస్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో నాణ్యమైన ఆహారం అందించాలి

నల్లగొండ, జూలై 30: గురుకుల, సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున డిమాండ్‌చేశారు. పట్టణంలోని ఎన్‌జీ కళాశాల ఆవరణలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో వెయ్యికి పైగా గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో నాణ్యమైన ఆహారం అందించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులు పస్తులు ఉండాల్సి వస్తోందన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 18మంది, రాష్ట్రంలో ఇప్పటికే వివిధ కారణాలతో 40 మంది విద్యార్థులు చనిపోయారని ఆరోపించారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా విద్యాశాఖ మంత్రిని నియమించాలన్నారు. సమావేశంలో నాయకులు మేడబోయిన వెంకన్న, నవీన్‌కుమార్, శంకర్, లింగస్వామి, రమేష్, సతీష్‌కుమార్, అంజనేయులు, దయాకర్, రామచంద్రమూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

శాలిగౌరారం, జూలై 30: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని లయన్స్ క్లబ్ ప్రతినిధులు కోరారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేని బాబురావు పుట్టిన రోజున పురస్కరించుకొని శాలిగౌరారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వల్లాలలోని మోడల్ స్కూల్, శాలిగౌరారం పీఎఎస్, జడ్పీ స్కూల్ విద్యార్థులకు స్వీట్స్, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఫాస్ట్ జోన్ చైర్మన్ ఎర్ర శంబులింగారెడ్డి, చార్టర్ ప్రెసిడెంట్ బుడిగె శ్రీనివాసులు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు డెంకల సత్యనారాయణ, కోశాధికారి వడ్లకొండ భిక్షంగౌడ్, వల్లాల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జి.రాగిణి, జడ్పీస్కూల్ హెచ్ఎం కోట మల్లయ్య, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

దరఖాస్తులు.. బుట్టదాఖలు

● ఆన్‌లైన్ చేయని కొందరు రాజవరం గ్రామస్థుల దరఖాస్తులు ● సబ్సిడీ అందక నిరుత్సాహం ● అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం



తిరుమలగిరి(సాగర్), జూలై 30: సంక్షేమ పథకాలు అందించే లక్ష్యంతో పేదల నుంచి స్వీకరించిన దరఖాస్తులు అధికారుల నిర్లక్ష్యంతో బుట్టదాఖలయ్యాయి. ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ప్రభుత్వ సబ్సిడీలకు అనర్హులవుతున్నారు. మండలంలోని రాజవరం గ్రామంలో గత ఏడాది డిసెంబరు 28వ తేదీ నుంచి 2024 జనవరి 6వ తేదీ వరకు ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరించారు. మండల వ్యవసాయాధికారి ఎ. జానకిరాములు నోడల్ అధికారిగా, గ్రామపంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి ప్రకాశ్ గ్రామస్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ క్రమంలో జనవరి 8వ తేదీ నుంచి జనవరి 19 వరకు ఆన్‌లైన్ చేయాల్సిన బాధ్యత మండల స్థాయి అధికారుల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శి నిర్వహించాలి. గ్రామంలో మొత్తం 780 దరఖాస్తులు రాగా, 578దరఖాస్తులను ఆన్‌లైన్ పూర్తి చేశారు. మిగిలిన 262దరఖాస్తులను వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ చేయకుండా బుట్టదాఖలు చేశారు. దీంతో అప్పటి నుంచి ఆన్‌లైన్ కాని దరఖాస్తు దారులు ప్రభుత్వం అందిస్తున్న గృహజ్యోతి జీరో బిల్లులు, మహాలక్ష్మీ గ్యాససబ్సిడీతో పాటు ఇతర పథకాలకు వీరు అనర్హులయ్యారు. పలు మార్లు గ్రామ, మండలస్థాయి అధికారులకు గ్రామస్థులు సమస్యను విన్నవించుకున్నారు. కొన్ని రోజుల క్రితం ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి గ్రామానికి రాగా ఆయనకు సైతం ఈ విషయంపై ఫిర్యాదు గ్రామస్థులు చేశారు. అయినప్పటికీ సమస్యకు పరిష్కారం లభించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. అప్లికేషన్లను ఆన్‌లైన్ చేయకుండా నిర్లక్ష్యం వహించిన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన పరిస్థితి కల్పించారు



సుమారు ఆరు నెలల క్రితమే మా గ్రామపంచాయతీలో కార్యదర్శికి దరఖాస్తులు ఇచ్చాం. ఆయన మా దరఖాస్తులు ఆన్‌లైన్ చేయలేదంటున్నారు. దీంతో మాకు జీరో కరెంట్ బిల్లులు, గ్యాస్ సబ్సిడీ రావట్లేదు. మళ్లీ దరఖాస్తు చేసు కోవాలని చెప్పడంతో మళ్లీ దరఖాస్తులు నింపి కార్యదర్శికి ఇచ్చాం.

● కంచెర్ల గురవయ్య, రాజవరం గ్రామస్థుడు.

సమస్య కలెక్టర్‌కు నివేదించాం

రాజవరం గ్రామానికి చెందిన 262మంది ప్రజాపాలన దరఖాస్తులు ఆన్‌లైన్ చేయకపోవడం వాస్తవమే. గ్రామస్థుల ఫిర్యాదుతో కలెక్టర్‌కు నివేదించాం. వెబ్‌సైట్ ఫ్రీజ్ చేయడంతో ప్రస్తుతం దరఖాస్తులు ఆన్‌లైన్ చేయలేకపోతున్నాం. వెబ్‌సైట్ ఓపెన్ కాగానే ఆన్‌లైన్ చేస్తాం.

● రమేష్, ఎంపీడీవో.

సంతకు వచ్చే రైతులకు సౌకర్యాలు కల్పించాలి

మిర్యాలగూడ, మిర్యాలగూడ రూరల్, జూలై 30: వారంలో రెండుసార్లు జరిగే సంతకు వచ్చే రైతులకు అసౌకర్యం కలగకుండా చూడాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అధికారులకు సూచించారు. అవంతిపురం మార్కెట్ యార్డును మంగళవారం సందర్శించి రైతులతో మాట్లాడారు. వారంలో మంగళ, శనివారాల్లో రెండు సార్లు జరిగే జిల్లాలోనే పెద్దదని అన్నారు. సుదూర ప్రాంతాలనుంచి రైతులు, వ్యాపారులు సంతకు వచ్చి, పశువులు, గొర్రెలు, మేకల క్రయ విక్రయాలు కొనసాగిస్తుంటారన్నారు. బేరాల కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు సంతలో వుండే వారికి తాగునీటి ట్యాప్‌లు ఏర్పాటు చేయాలన్నారు. జంతువులకు మధ్యమధ్యలో నీటి తొట్లు ఏర్పాటు చేసి సాయంత్రం వరకు తొట్లలో నీరు నింపే ఏర్పాట్లు చేయాలన్నారు. ఆగస్టు 11వ తేదీన అవంతీపురంలోని



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

ఈద్గా వద్ద రెండు వేల మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆగస్టు 15ను ఘనంగా నిర్వహించనున్న 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని జాతీయతా భావాన్ని చాటిచెప్పాలని కోరారు.

హామీల అమలుకు ఉద్యమించాలి : జూలకంటి

నల్లగొండ రూరల్, జూలై 30: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీల అమలుకు ఉద్యమాలు నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలో మంగవారం జరిగిన పార్టీ జిల్లా కమిటీ, మండల కార్యదర్శుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందన్నారు. విభజన చట్టం హామీలను ఏ విధంగా అమలు చేస్తారో బడ్జెట్లో స్పష్టంగా ప్రకటించలేదన్నారు. తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపడం సరికాదన్నారు. విభజన హామీలు అమలు చేసేందుకు కేంద్రంపై కాంగ్రెస్ ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సీపీఎం కార్యకర్తలు సిద్ధం కావాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతు రుణా మాఫీ పూర్తి స్థాయిలో చేయాలన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం, డిండి ఎత్తిపోతల పథకం పనులను పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు విడుదల చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, డబ్బికార్ మల్లేష్, బండ శ్రీశైలం, కందాల ప్రమీల, పాలడుగు నాగార్జున, ప్రభావతి, ఎండీ. హాషం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ రూరల్: రైతాంగ పోరాట స్ఫూర్తితో ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని తడకమళ్ల గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు గట్టికొప్పుల రాంరెడ్డి 5వ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్నికల్లో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరిస్తున్న ప్రభుత్వాలపై ప్రజాపోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, చౌగాని సీతారాములు, పరుశురాములు ఉన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

దేవరకొండ, జూలై 30: మండలంలోని తాటికోలు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు. మంగళవారం తాటికోలు వాగునుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారన్న తక్రమంగా దేవరకొండకు ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని పోలీ‌స్‌స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ డ్రైవర్లు బాలు, లోక్యా, పాండులపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం

నార్కట్‌పల్లి, జూలై 30: మండలంలోని అవురవాణి గ్రామానికి చెందిన మహిళ ఆదివారం అదృశ్యమైంది. ఆమె భర్త శంకరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 28న తన భార్య ఆకారం పార్వతమ్మ(50) ఇంటికి తాళం వేసి వెళ్లిందని, ఊర్లో వెతికినా కన్పించలేదన్నారు. బంధువులకు ఫోన్‌చేసి వాకబు చేసినా ఫలితం లేదన్నారు. పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

హామీలు అమలు చేయాలి

నల్లగొండ రూరల్, జూలై 30: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. నల్లగొండ పట్టణంలో అనేక ప్రాంతాల్లో నిరుపేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని, అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ సీనియర్ నాయకుడు మల్లెపల్లి ఆదిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, పట్టణ కార్యదర్శి గాదెబ్బక రమేష్, లెనిన్, తదితరులు పాల్గొన్నారు.

నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు

నల్లగొండ రూరల్, మాడ్గులపల్లి, దామరచర్ల, నల్లగొండ క్రైం, దేవరకొండ, కట్టంగూరు, శాలిగౌరారం, నార్కట్‌పల్లి, కేతేపల్లి, జూలై 30: నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ. సలీం, జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య అన్నారు. సమస్యల పరిష్కారానికి హైదరాబాద్‌కు వెళ్తున్న గ్రామపంచాయతీ, ఆశ వర్కరుల, సీఐటీయూ నాయకులను పోలీసులు మంగళవారం అరెస్టు చేయడాన్ని ఒక ప్రకటనలో ఖండించారు. హైదరాబాద్‌కు వెళ్తున్న కార్మికులను మాడ్గులపల్లిలో పోలీసులు అడ్డుకున్నారు. అరెస్టయిన వారిలో దర్శనం సైదులు, పుల్లెంల వెంకన్న, దర్శనం లక్ష్మయ్య, కృష్ణ, దస్తగిరి ఉన్నారు. దామరచర్లలో సీఐటీయూ మండల కన్వీనర్ భైరం దయానంద్, నాయకులు అక్కనపల్లి సైదులు, ఎండి.జహీరుద్దిన్, లావూరి పాపానాయక్, డేగల మహేశ్వరి, జింకల పద్మను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నల్లగొండలో సీఐటీయూ, ఆశ కార్యకర్తలు, జీపీ కార్మికులను పోలీసులు అడ్డుకున్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ ప్రకటించిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్. లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. దేవరకొండలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నల్ల వెంకటయ్య, వెంకటయ్య, లక్ష్మీ, దేవమ్మ, విజయలక్ష్మీ, నాగరాజు, శ్రీను, దానయ్య, కమలమ్మ, పద్మ పాల్గొన్నారు. కట్టంగూరు, శాలిగౌరారం, కేతేపల్లి మండలాల్లో నాయకులను అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా ప్రత్యేక ఉపాధ్యాయుల నోషనల్ ఇంక్రిమెంట్లు, పెన్షనర్ల సమస్యల సాధన కోసం హైద్రాబాద్‌లో జరిగే మౌనదీక్షకు వెళ్తున్న వారిని అడ్డుకుని అరెస్టు చేయడం శోచనీయమని ప్రత్యేక ఉపాధ్యాయులు, పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పన్నాల గోపాల్‌రెడ్డి విమర్శించారు. హైద్రాబాద్‌లో జరిగే మౌనదీక్షకు బస్సులో వెళ్తున్న వారిని పోలీసులు నార్కట్‌పల్లి వద్ద అడుకుని పోలీ‌స్‌స్టేషన్‌కు తరలించారు.



నల్లగొండలో పోలీసుల అదుపులో ఉన్న సీఐటీయూ నాయకులు

పబ్లిక్ ఎజెండా

public agenda

చినుకు పడితే వీధులు చిత్తడి.. చింతపల్లి: వర్షాలకు వీధులు చిత్తడిగా మారుతున్నాయి. మండలంలోని గొడకొండ్ల గ్రామంలో పూర్తి స్థాయిలో సీసీరోడ్లు నిర్మించకపోవడంతో వీధులు చిత్తడిగా మారుతున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం మట్టి పోసైనా సమస్య పరిష్కారించాలని కోరినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో కాలనీలను సందర్శించి మట్టిపోసి సమస్య పరిష్కరిస్తామని గ్రామపంచాయతీ కార్యదర్శి పద్మ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చెట్లు.. చండూరు రూరల్: మండలంలోని కస్తాల గ్రామంలోని ఊరిమధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. రైతులు ఏదైనా అవసరంతో ఎల్‌సీ తీసుకోవాలన్నా, విద్యుత్ అంతరాయం కలిగినప్పుడు భయం భయంతో చేతిలో పెద్ద కర్ర, గొడ్డలి తీసుకొని చెట్లను నరికివేసుకుంటూ ఎక్కడ వైర్లు తేలి ఉన్నాయో, ఎర్త్ వస్తుందో భయం భయంగా ట్రాన్స్‌ఫార్మర్ చేరుకునే పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని అధికారులకు విన్నవించినా ఫలితం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.

రోడ్డుపై మురుగునీరు.. ఎవరూ పట్టించుకోరు.. శాలిగౌరారం: మండలంలోని పెర్కకొండారం గ్రామంలోని పలు వీధుల్లోని మురుగు కాల్వలు ధ్వంసమై మురుగు నీరు రోడ్లపై వస్తోంది. దీంతో ఈగలు, దోమలు వ్యాపిస్తున్నాయి. ఎక్కడ పడితే అక్కడ చెత్త చెదారం పడేస్తున్నారు. ప్రధాన వీధిలో గ్రామపంచాయతీ ఎదురుగా కొంతమంది మురుగు నీటిని రోడ్డుపైకి వదిలిపెడుతున్నారు. సమస్య పరిష్కరించి, అనారోగ్యాల బారిన పడకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

డ్రగ్స్‌తో భవిష్యత్ నాశనం చేసుకోవద్దు

పెద్దఅడిశర్లపల్లి, జూలై 30: యువత డ్రగ్స్‌కు అలవాటు పడి భవిష్యత్ నాశనం చేసుకో వద్దని కొండమల్లేపల్లి సర్కిల్ సీఐ ధనంజయ్యగౌడ్ సూచించారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రగ్స్ వాడడం వల్ల వ్యక్తి నియంత్రణ కోల్పోయి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేయడానికి అవకాశముందన్నారు. మాదక ద్రవ్యాల రహితజిల్లాగా చేయడానికి యువత ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ డి. నర్సింహులు, ఎంఈవో తరి రాములు, పాఠశాల ప్రిన్సిపాల్ మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: మండలకేంద్రంలోని మోడల్ స్కూల్లో మిషన్ పరివర్తన్ కార్యక్రమంపై ఎస్ఐ యాదయ్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలు, గంజాయి, వంటి చెడు అలవాట్లపై బానిస కాకుండా క్రమశిక్షణతో చదవాలని తెలిపారు.

అంగడిపేటతండాలో ఘనంగా సీత్లా పండుగ



సీత్లా పండుగలో పాల్గొన్న అంగడిపేటతండా వాసులు

పెద్దఅడిశర్లపల్లి, జూలై 30: గిరిజనులు ప్రతి ఏటా పెద్దపుశాల కార్తెలో నిర్వహించే సీత్లాభవాని పండుగను మండలంలోని అంగడిపేటతండాలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రజలు, పశుపక్ష్యాదులు ఆరోగ్యంగా ఉండాలని, పాడిపంటలు సంవృద్ధిగా పండాలని, వర్షాలు కురవాలని గిరిజన మహిళలు, యువతులు నైవేద్యాలు సమర్పించారు.

వంటగ్యాస్‌ను వాణిజ్య అవసరాలకు వినియోగించొద్దు

నల్లగొండ టౌన్, జూలై 30: గృహ అవసరాలకు వినియోగించే వంట గ్యాస్‌ను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే చర్యలు తప్పవని విజిలెన్స్ సీఐ గౌస్ హెచ్చరించారు. నల్లగొండ పట్టణంలోని పలు షాపుల్లో పౌరసరఫరాల శాఖ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. రవీంద్రనగర్‌లోని సువర్ణ క్యాటరింగ్‌లో నిల్వ ఉంచిన ఎనిమిది డొమెస్టిక్ సిలెండర్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కమర్షియల్‌కు బదులుగా డొమెస్టిక్ సిలెండర్లు వాడడంపై షాపు నిర్వాహకుడిపై 6-కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో పౌరసరఫరాలశాఖ డిప్యూటీ తహసీల్దార్ దీపక్, ఆర్ఐ లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీని విజయవంతం చేయాలి

నల్లగొండ టౌన్, జూలై 30: హక్కుల సాధన కోసం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 6, 7వ తేదీల్లో నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మిర్యాల యాదగిరి, జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ కోరారు. పట్టణంలో మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. జనగణనలో బీసీల కుల గణన చేపట్టాలన్నారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్ట సభల్లో బీసీలకు 50శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కార్యక్రమంలో బీసీ యువజన విభాగంం అధ్యక్షుడు మునాసప్రసన్న కుమార్, బెస్త సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుండు వెంకటేశ్వర్లు, గౌడ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వీరమల్ల నాగరాజుగౌడ్, సట్టు యాదగిరి, కంభంపాటి శంకర్‌దుర్గ, చెరుపల్లి సదానందగౌడ్, పగిళ్ల కృష్ణ, భరత్‌కుమార్ పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా పట్ల యువత జాగ్రత్తగా ఉండాలి

నల్లగొండ క్రైం, జూలై 30: మానవ అక్రమ రవాణా పట్ల యువత జాగ్రత్తగా ఉండాలని బాలల సంక్షేమ సమితి జిల్లా చైర్మన్ చింత కృష్ణ, కార్మిక శాఖ అధికారి అరుణ, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ కరుణాకర్ సూచించారు. మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, నాసా, షీటీమ్, భరోసా, సఖి సెంటర్ల ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఉపాధి అవకాశాలను ఎరగావేసి యువతీ, యువకులను అక్రమ రవాణాకు గురిచేస్తారని, వీటి పట్ల జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి, గ్రంథపాలకులు సుంకరి రాజారాం, డీసీపీయూ మందుల వెంకన్న, సీహెచ్ఐ మహేష్, భరోసాసెంటర్ ప్రతినిధి నళిని ఉన్నారు.

సంక్షిప్త సమాచారం..

నల్లగొండ, మిర్యాలగూడ: మిర్యాలగూడలోని ఈఎస్ఐ డిస్పెన్సరీని 50 పడకల పూర్తిస్థాయి ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని కాంగ్రెస్ నేత గుడిపాటి సైదులు బాబు కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి డా.మనసుఖ్ మాండవీయకు విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు కేంద్ర మంత్రికి మంగళవారం ఎక్స్ (ట్విట్టర్)వేదికగా వినతిపత్రాన్ని పంపించారు.

శాలిగౌరారం: అనారోగ్యంతో మృతిచెందిన మండలంలోని ఉట్కూరు గ్రామానికి చెందిన కళాకారుడు సాంస్కృతిక సారధి ఉమ్మడి జిల్లా మాజీ కన్వీనర్ వేముల నరేష్ ముగ్గురు పిల్లల పేరున ప్రజా గాయకుడు ఏపూరి సోమన్న రూ.50వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. డిపాజిట్ పత్రాలను తెలంగాణ ఉద్యమకారులు వేముల అందీప్, శేఖర్, కుటుంబ సభ్యులకు అందజేశారు. నరేష్ అకాల మృతి తీరని లోటని అన్నారు.

నల్లగొండ రూరల్: నల్లగొండ పట్టణ పరిధిలోని 11వ వార్డు కతాల్‌గూడ గ్రామాన్ని నల్లగొండ మునిసిపాలిటీలో చేసినా సౌకర్యాలు కల్పించలేదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దండెంపల్లి సత్తయ్య మంగళవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం దండెంపల్లి సరోజ, పనస చంద్రయ్య, యాదయ్య పాల్గొన్నారు.

శాలిగౌరారం: సీఎం రేవంత్ రెడ్డి రైతులకు రుణమాఫీ చేయడం రైతులకు వరమని జిల్లా కాంగ్రెస్ నాయకులు దండ అశోక్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని రైతుల క్షేమాన్ని కోరుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన రుణమాఫీ హామీని నిలబెట్టిందన్నారు.

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి ఎస్ఐగా బీ. క్రాంతికుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని కోరారు.

గుర్రంపోడు: బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శిగా మండలంలోని కొప్పోలు గ్రామానికి చెందిన అయితరాజు నాగరాజు నియమితులయ్యారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్టల శ్రీనివాస్‌ముదిరాజ్ నియామకపత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన సంఘం నాయకులకు నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు.

దేవరకొండ: ప్రతి ఇంట్లో ఐదు మొక్కలు నాటి సంరక్షించాలని మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ కోరారు. పట్టణంలోని 16వ వార్డు, గాంధీ బజార్‌లో మొక్కలు పంపిణీ చేశారు. మున్సిపాలిటీలో 15వేల మొక్కలు నాటుతామన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గార్లపాటి దామోదర్, వెంకటేశ్వర్లు, భీష్మా, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూరు: ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా యువత జాగ్రత్త పడాలని ఎస్ఐ ఎన్.శ్రీనివాస్ సూచించారు. కట్టంగూరులో యువతకు ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. గుర్తుతెలియని వ్యక్తులు గంజాయి విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు శంకర్, సైదులు తదితరులు ఉన్నారు.

కట్టంగూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కమ్యూనిటీ లంచ్ అందించేందుకు దాతలు ముందుకు రావాలని కట్టంగూరు జిల్లా పరిషత్ హెచ్ఎం అంబటి అంజయ్య కోరారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులకు చికెన్ కర్రీ, ఆయిల్ రైస్ భోజనం అందించారు. దాతలు సహకరిస్తే ప్రతినెలా ఈ కార్యక్రమం చేపడతామని పాఠశాల హెచ్ఎం తెలిపారు.

చిట్యాల: మండలంలోని గుండ్రాంపల్లిలో గల రామలింగేశ్వర స్వామి దేవాలయంలోని ధ్వజస్థంభాన్ని పునరుద్ధరించాలని సీపీఎం మండల కమిటీ సభ్యుడు కత్తుల లింగస్వామి కోరారు. ధ్వజసంభాన్ని పునరుద్ధరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యాదయ్య, రత్నం, యాదయ్య పాల్గొన్నారు.

మిర్యాలగూడ: విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించి జాబ్‌క్యాలెండర్ విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇందూరు సాగర్ డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగులకు న్యాయం చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించాద్దన్నారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశంలో విద్యారంగానికి 7.3శాతం నిధులు మాత్రమే కేటాయించడం అన్యాయమని అన్నారు.

చండూరురూరల్: మండలంలోని బంగారిగడ్డ గ్రామానికి చెందిన కొంగల అఖిల్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మంజూరు చేయించిన రూ.50 వేల ఎల్ఓసి చెక్కును మాజీ ఎంపీటీసీ పల్లె వెంకన్న లబ్ధిదారుడి కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇరిగి రాజు, సుంకరి శివనారి, బొడ్డు ముత్తయ్య, తలారి నర్సింహ, ఇరిగి నర్సింహ, బొడ్డు ప్రభాకర్, మొగుదాల గిరి, కర్నాటి నర్సింహ పాల్గొన్నారు.

శాలిగౌరారం: శాలిగౌరారం మండలం మాదారం గ్రామంలోని గ్రామపంచాయతీ ట్రాక్టర్‌తో పాటు ఏడు ట్రాక్టర్ల బ్యాటరీలను సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు శాలిగౌరారం ఎస్ఐ డి. సైదులు తెలిపారు. మాదారం గ్రామపంచాయతీ కార్యదర్శి బండారు శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నల్లగొండ: టీటీసీలో చేరేందుకు డీఈఈసెట్ 2024 సంవత్సరంలో ర్యాంకు సాధించి అర్హత కలిగిన అభ్యర్థులు డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యూకేషన్ (డీఈఎల్ఈడీ), డిప్లమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యూకేషన్ (డీపీఎస్ఈ) కోర్సుల్లో ప్రవేశానికి ఆగస్టు 1వ తేదీ నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని డైట్ కళాశాల ప్రధానాచార్యులు కానుగుల నర్సింహ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు వెరిఫికేషన్‌కు అర్హులైన వారందరూ సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.